


ఇస్రో శాస్త్రవేత్తలకు శ్రీసిటీ ఎమ్‌డి అభినందనలు

ప్రజాశక్తి - వరదయ్యపాళెం

ఎస్ఎస్ఎల్‌వీ-డి2 రాకెట్ ప్రయోగం విజయవంతం అయినందుకు శ్రీసిటీ వ్యవస్థాపక నిర్వాహక సంచాలకులు డా. రవీంద్ర సన్నారెడ్డి హర్షం వెలిబుచ్చారు. ఈ ప్రయోగం ద్వారా ఈఓఎస్-07తో పాటు అమెరికాకు చెందిన జానూస్-1, భారత దేశ పాఠశాల విద్యార్థులు రూపొందించిన ఆజాదిశాట్-2 సూక్ష్మ ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలలోకి పంపడంలో విజయం సాధించినందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అధ్యక్షులు కే. సోమనాథ్‌కు, షార్ డైరక్టర్ ఏ. రాజరాజన్ కు, షార్ శాస్త్రవేత్తలకు అలాగే ఇతర ఉద్యోగస్థులకు ఆయన అభినందనలు తెలిపారు. ఎస్.ఎస్.ఎల్.వీ విజయాన్ని ఇస్రో యొక్క వాణిజ్య ప్రయోగాల పరంపరలో ఒక పెద్ద ముందడుగు అని పేర్కొన్నారు.



అప్పు తీర్చలేదని... రోటోవేటర్‌తో వేరుశనగ పంట ధ్వంసం

చిట్టత్తూరులో వ్యాపారి దౌర్జన్యం / గుండెలు బాదుకుంటున్న రైతు

ప్రజాశక్తి- తొట్టంబేడు

తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం చిట్టత్తూరు గ్రామంలో పది రోజుల్లో చేతికి వచ్చే ఐదు ఎకరాల విస్తీర్ణంలో సాగుచేసిన వేరుశనగ పంటను గురువారం రాత్రి ఓ వ్యాపారి ఓ రాజకీయ పార్టీ నేతల అండతో దౌర్జన్యంగా ట్రాక్టర్లతో దున్నేయించారు. పంట ఇంటికి చేరే సమయంలో వ్యాపారి ఇలా చేయడంతో బాధిత రైతు గుండెలు బాదుకుంటూ లబోదిబోమంటున్నాడు. రైతులకు, వ్యాపారులకు మధ్య ఆర్థిక లావాదేవీలు ఉండటం సహజమేనని... అప్పు పేరుతో ఇలా పంట ధ్వంసం చేయడం ఎంతవరకు న్యాయమని చిట్టత్తూరు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

తొట్టంబేడు మండలం చిట్టత్తూరుకు చెందిన మురళీకష్ణారెడ్డి, ఉమాదేవి దంపతులకు అదే గ్రామ రెవిన్యూ పరిధిలో తెల్లరాళ్లమిట్ట సమీపంలో సర్వే నంబరు:411-1లో 4ఎకరాలు, సర్వే నంబరు:414-1లో 0.95ఎకరాలు భూమి ఉంది. ఈ నేలలో వీరు రెండు నెలల కిందట వేరుశనగ పంట సాగు చేశారు. ఈ పంట పది రోజుల్లో కోత కోయాల్సి ఉంది. ఇదిలా ఉండగా మురళీకష్ణారెడ్డి తన కుటుంబ, వ్యవసాయ అవసరాల కోసం శ్రీకాళహస్తికి చెందిన ఓ వ్యాపారి వద్ద కొంత మొత్తం అప్పు తీసుకున్నాడు. ఈ అప్పు కూడా చాలా వరకు చెల్లించాడు. ఇంకా కొంత అప్పు చెల్లించాల్సి ఉంది. మురళీకష్ణారెడ్డి అప్పు తీసుకున్న సమయంలో సదరు వ్యాపారికి ప్రామిసరీ నోటు రాయించారు. ఈ భూమిని తాకట్టు పెట్టారు. దీనిని



ఆధారంగా చేసుకుని మురళీకష్ణారెడ్డి భూమిని ఎలాగైనా కాజేయాలని సదరు వ్యాపారి కుట్ర పన్నారు. గతంలో కూడా ఈ భూమిలో వేసిన పంటను ఈ వ్యాపారి ఓ రాజకీయ పార్టీ అండతో దౌర్జన్యంగా ధ్వంసం చేశారు. అప్పట్లో ఈ ఘటన వివాదమైంది. ఇరువర్గాల వారు కేసులు పెట్టుకున్నారు. ఈ భూమి వివాదం ప్రస్తుతం న్యాయస్థానంలో ఉంది. ఇలా ఉండగా సదరు వ్యాపారి తనకు ఉన్న రాజకీయ పలుకుబడితో మురళీకష్ణారెడ్డి కుటుంబ సభ్యుల పేరున ఉన్న ఈ భూమిని ఎలాగైనా ఆన్ లైన్ నుంచి తొలగించడానికి ప్రయత్నం చేశాడు. ఈ కేసు న్యాయస్థానంలో ఉన్నందున అది వీలు కాలేదు. మురళీకష్ణారెడ్డి కుటుంబ సభ్యుల పేరిట ఉన్న భూమి తనకు దక్కక పోవడంతో అతనికి ఎలాగైనా నష్టం చేయాలని ఈ వ్యాపారి పథకం రచించాడు. ఇందులో భాగంగా గురువారం రాత్రి పొద్దు పోయాక అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో కొంతమంది అనుచరులతో ట్రాకర్లు తీసుకెళ్లి రోటోవేటర్ల సాయంతో మురళీకష్ణారెడ్డికి చెందిన ఐదు ఎకరాల వేరుశనగ పంట దున్నేయించి ధ్వంసం చేసి వచ్చేశారు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన మురళీకష్ణారెడ్డి ఇది చూసి భోరున విలపించాడు. పది రోజుల్లో చేతికి వచ్చే పంటను ధ్వంసం చేయడంతో తాను రూ.లక్షల్లో నష్ట పోవాల్సి వచ్చిందని ఆయన కన్నీటి పర్యంతమయ్యాడు. వేరుశనగ పంట ధ్వంసం చేయడాన్ని చిట్టత్తూరు గ్రామ రైతులు అందరూ ఖండించారు. ఈ ఘటనపై బాధితుడు మురళీకష్ణారెడ్డి తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రైతు పొలం దున్నేసింది వాస్తవమేనని తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి: బొజ్జల బృందమ్మ

తొట్టంబేడు మండలం చిట్టత్తూరులో మురళీకష్ణారెడ్డికి చెందిన భూమిలో వేరుశనగ పంట ధ్వంసం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బొజ్జల బృందమ్మ డిమాండు చేశారు. ఈ మేరకు ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రైతులు కష్టపడి పండించిన పంటను రాజకీయాలతో ఇలా ధ్వంసం చేయడం ఎంత వరకు న్యాయమని ఆమె ప్రశ్నించారు. ఏదైనా సమస్య ఉంటే న్యాయపరంగా చూసుకోవాలే తప్ప ఇలా దౌర్జన్యాలు చేయడం మంచిది కాదన్నారు. అధికారులు వెంటనే స్పందించి మురళీకష్ణారెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని బొజ్జల బందమ్మ డిమాండు చేశారు. ట్రాక్టర్లతో దున్నేసిన పొలాన్ని టిడిపి నాయకులు గాలి చలపతినాయుడు, గాలి మురళీనాయుడు పరిశీలించారు.

ఆర్జేడీ ప్రమేయంతో గిఫ్ట్ ప్యాక్‌లా..?

అక్రమాలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోండి : వామపక్షాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆర్జేడీ ప్రమేయంతో తిరుపతి రూరల్ లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించి వారికి అధికార పార్టీ అభ్యర్థి అయిన చంద్రశేఖర్ రెడ్డి తరఫున గిఫ్ట్ బాక్సులు అందించారని వామపక్షాల నాయకులు విమర్శించారు. అతనిని ఎన్నికలు జరిగే జిల్లాలో విధులు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా విచారణ నిర్వహించాలని ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారి రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు .ఈ సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నగర కార్యదర్శి టి సుబ్రమణ్యం, సిపిఐ నగర కార్యదర్శి విశ్వనాథం మాట్లాడుతూ పదే పదే ఫిర్యాదులు చేసినప్పటికీ ఓటర్ లిస్టులో అవకతవకలను అరికట్టడంలో ఎన్నికల అధికారులు పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు ఒకే ఓటరు 30 సార్లు లిస్టులో వచ్చారంటే ఎంత అలసత్వంతో ఓటర్ లిస్టు ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇప్పటికీ అనేక పోలింగ్ బూత్ పరిధిలో వందలాది డబల్ ఓట్లు నమోదయి ఉన్నాయని ఆధారాలతో సహా తెలిపారు. ఉపాధ్యాయుల ఓటర్ల



నమోదులో భారీ అవకతవకలకు పాల్పడ్డారని ఓటర్ లిస్టు వచ్చిన తర్వాత 780 ఉపాధ్యాయ ప్రైవేటు విద్యాసంస్థల ఓట్లను నమోదు చేసి అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. ఆర్జెడి ప్రతాపరెడ్డి డిఇఓ ల మీద ఒత్తిడి చేసి ఈ ఓట్లు నమోదు చేయించడానికి ప్రయత్నించారని తెలిపారు. ఇప్పటికైనా స్వచ్ఛమైన ఓటర్ లిస్ట్ ప్రకటించడానికి ప్రయత్నించాలని తెలిపారు .తిరుపతి నగరంలో16 పోలింగ్ బూత్లను 25 పోలింగ్ బూతులుగా పెంచిన విషయాన్ని ఎన్నికల అధికారి అనుపమ అంజలి తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి, బిజెపి నాయకులతోపాటు అర్బన్ తహశీల్దార్, డిప్యూటీ కమిషనర్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు

ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు : కలెక్టర్

తిరుపతి టౌన్ : ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని, లెసన్‌ప్లాన్ విధానంతో బోధన జరగాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్లో మండల విద్యాశాఖాధికారులతో, ప్రధానోపాధ్యాయులతో, కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశమయ్యారు. ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థని, ఏ వృత్తిలో లేని గౌరవం ఉపాధ్యాయులకు దక్కుతుందన్నారు. తాను టీచర్‌గా పనిచేసి, ఆ తరువాత పలు ఉద్యోగాలు చేసి ఐఎఎస్‌గా కలెక్టర్ అయ్యానని చెప్పారు. సాంకేతికతను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు అందిపుచ్చుకోవాలన్నారు. లెసన్‌ప్లాన్ అనుసరించి మనస్ఫూర్తిగా బోధించినపుడే విద్యార్థులు గుర్తుపెట్టుకుంటారన్నారు. గత సంవత్సరం పదో తరగతి ఉత్తీర్ణత 58 శాతమని, ఈ ఏడాది 100 శాతం వచ్చేలా



ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దాలన్నారు. బైజూస్ ట్యాబ్‌లను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలన్నారు. పౌష్టికాహార లోపం పిల్లలు చెప్పే పాఠాలను శక్తి లేనందున వినలేరని అందువల్లే వెనుకబడతారని అన్నారు. తన పర్యటనలో వెంకటగిరి బిసి రెసిడెన్షియల్ స్కూల్లో ఉన్న 640 మంది విద్యార్థులు పౌష్టికాహార లోపాలు ఉన్నవారని గుర్తించిన ప్రిన్సిపల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని స్థానికంగా సంప్రదించి అదనపు పౌష్టికాహారం గుడ్డు, చిక్కిలు అందించడంతో నేడు పూర్తిగా పౌష్టికాహార లోపం నుండి కేవలం 45 రోజులలో బయటపడ్డారని ఈ సందర్భంగా ఆమెను అభినందిస్తున్నానని అన్నారు. ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు కూడా బై జ్యూస్ ట్యాబ్ లను అందించాలని డి.ఈ.ఓ కు సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఇ ఓ శేఖర్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎ ఓ పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా, విభజన హామీలపై...

22-28 తేదీల్లో నిరసనలకు పిలుపు : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాజధాని, ప్రత్యేక హెూదా, విభజన హామీల విషయంలో బిజెపి రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలోను, కేంద్రంలోను బిజెపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్దయెత్తున ఫిబ్రవరి 22 నుండి 28 వరకు ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజధానిని మార్చడం సరికాదన్నారు. విద్యార్థి, యువజన సంఘాలు బస్సు యాత్ర నిర్వహించిన తరువాత ప్రత్యేక హెూదాపై మరలా చర్చ ప్రారంభమైందని, రాష్ట్ర హక్కులను సాధించేంతవరకు పోరాటం సాగించాలని తెలిపారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపిలు దీనిపై నోరెత్తడంలేదన్నారు. అదానీ అవినీతి కుంభకోణం నుండి ప్రజల దష్టిని ప్రక్కదారి పట్టించేందుకు 'కౌ హగ్' పేరుతో భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు బిజెపి కొత్తగా కార్యక్రమాన్ని ముందుకు తీసుకొచ్చిందని, మతోన్మాద కార్యకలాపాలను ప్రమాదకర స్థాయికి తీసుకెళుతున్నారని పేర్కొన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి రాకుండా నిరోధించేందుకు వామపక్ష ప్రజాతంత్ర శక్తులను కలుపుకుని పోరాడాలని పిలుపునిచ్చారు.

సీఎం జగన్‌కు ముక్కంటి ఆహ్వానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డితో పాటు ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో సాగర్ బాబు శుక్రవారం సీఎంను విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో కలిసి శివరాత్రి ఆహ్వాన పత్రికలు, ముక్కంటి తీర్థప్రసాదాలు జ్ఞాపికలు అందజేశారు.



నాగలి పట్టిన నారా లోకేష్

ప్రజాశక్తి - ఎస్ఆర్‌పురం (చిత్తూరు జిల్లా)

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 'యువగళం' పాదయాత్ర 15వ రోజు పంట పొలాల్లో సాగింది. కమ్మకండ్రిగలో కన్నయ్యకు చెందిన పొలంలో ఎద్దుల మడకతో పొలాన్ని నారా లోకేష్ రైతులతో కలిసి దుక్కిదున్నారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఎగువకండ్రిగ గ్రామంలో బెల్లం గానుగ దగ్గరకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి అధికారంలోకి రాగానే బెల్లం రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. శుక్రవారం సభల్లోనూ మైక్ అనుమతి లేకపోయినా యాత్ర కొనసాగింది.

శుక్రవారం ఉదయం చిత్తూరు జిల్లా ఎస్ఆర్‌పురం మండలంలోని ఎగువ కమ్మకండ్రిగ పంచాయతీ కమ్మకండ్రిగ గ్రామంలో యువగళం పాదయాత్రను ప్రారంభించారు. రాణిపురం, ఎగువ కమ్మకండ్రిగ, పుల్లూరు, కాపుకండ్రిగ, పద్మాపురం, ఆర్ఆర్‌పురం, ఎఎంపురం, సింధు రాజపురం వరకు 16 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. ఎస్ఆర్‌పురం మండలంలో నారా లోకేష్ ప్రసంగించడానికి పోలీసులు అనుమతించలేదు. అయినా ప్రతి గ్రామంలోనూ ఆయన గళాన్ని వినిపించారు. అడుగడుగునా మహిళలు మంగళ హారతులు ఇచ్చారు. దారిపొడవునా పూలవర్షం కురిసింది. పుత్తూరు గ్రామ పంచాయతీ కాపుకండ్రిగ గ్రామంలో ఎస్సీ సామాజికవర్గం యువతీ యువకులతో ముఖాముఖి నిర్వహించారు. దళితులు ఎదుర్కొంటున్న ఎస్సీ కార్పొరేషన్ నిధులు, బ్యాక్‌లాగ్‌పోస్టులు, రైతుల సమస్యలను దళితులు నారా లోకేష్‌కు విన్నవించారు. టిడిపి అధికారంలోకి రాగానే సమస్యలన్నింటికీ పరిష్కార మార్గాన్ని చూపిస్తామన్నారు. ఇప్పటివరకూ 169.5 కిలోమీటర్లు యాత్ర సాగింది. శుక్రవారం రాత్రి ఎస్ఆర్‌పురం హనుమాన్ టెంపుల్ వద్ద ప్రముఖులతో సమావేశమై, విడిది కేంద్రంలో బస చేయనున్నారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి : టిడిపి

తిరుపతి టౌన్ : గంగాధరనెల్లూరు మండలంలో శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్ పక్కన ఉన్న టిడిపి కార్యకర్త రాకేష్‌పై ఎస్ఐ దాడిచేయడం దారుణమని నగర కార్యదర్శి చినబాబు, వేణుగోపాల్‌నాయుడు, ఊక విజయకుమార్ విమర్శించారు. శుక్రవారం మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎస్ఐ అనీల్‌కుమార్ రాకేష్ చెంపపై కొట్టారన్నారు.

డూప్లికేట్ ఓటర్ల గుర్తింపు పూర్తి చేయాలి : కలెక్టర్

తిరుపతి టౌన్ : గ్రాడ్యుయేట్,టీచర్స్ ఓటర్లలో ఏ ఒక్క డూప్లికేట్ ఓటరు ఉండరాదని, ప్రత్యేకంగా పరిశీలించి తొలగింపు వివరాలు, పేర్లు పూర్తిస్థాయిలో నివేదిక అందించాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌నుంచి డిఆర్‌ఒ శ్రీనివాసరావు, అడిషినల్ ఎస్‌పి వెంకటరావు, ఇఆర్‌ఒ, ఎఇఆర్‌ఒలు, ఎస్‌హెచ్‌ఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తహశీల్దార్లు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై పోలింగ్‌కేంద్రాల వివరాలు, అనుసరించాల్సిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి తెలియజేయాలన్నారు. డూప్లికేట్ ఓటర్ల తొలగింపు, 10 వరకు అందే క్లైములు పరిశీలన చేయాలన్నారు.

అన్ని పార్టీలూ సహకరించాలి : అనుపమ అంజలి

జరగనున్న శాసన మండలి ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టిలు సహకరించాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్, శాసన మండలి ఎన్నికల నిర్వహణ అధికారి అనుపమ అంజలి కోరారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సాయంత్రం తిరుపతి నియోజక వర్గంలో శాసన మండలి ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో నియోజకవర్గంలో తక్షణం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, తిరుపతి అర్బన్ ఎమ్మార్వో వెంకటరమణలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి -గూడూరు

గూడూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కిరణ్‌కుమార్ శుక్రవారం చిత్తూరు- నెల్లూరు- ప్రకాశం పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎన్నికలు షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో గూడూరు మండలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. జెడ్.పి.హై స్కూల్ బాలురు , గూడూరు నందు 2 పోలింగ్ కేంద్రాలు, యాక్సిలరీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు, సదరు పోలింగ్ కేంద్రాల నందు ఎంట్రీ అండ్ ఎక్సిట్, ఎలక్ట్రిసిటీ, రాంప్ మొదలగు బేసిక్ మినిమం ఫెసిలిటీలను పరిశీలించారు. వీరి వెంట గూడూరు తహశీల్దారు లీలరాణీ, మండల సర్వేయరు రామ్ కుమార్ పాల్గొన్నారు.




సురుటుపల్లిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రజాశక్తి - నాగలాపురం/ తిరుచానూరు

తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీ పల్లి కొండేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తొలిరోజు శుక్రవారం ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి(మునిచంద్రశేఖర్ రెడ్డి) ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేసన్ గ్రామ దేవత పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో ఉదయం ఏడు గంటలకు గ్రామ దేవత పొన్నెమ్మకు విశేషాలంకరణ చేయడంతో పాటు అభిషేకం నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఏవీఎం మునిచంద్రశేఖర్ రెడ్డి (బాలాజీ రెడ్డి) మాట్లాడుతూ సర్వమంగళ సమేత శ్రీ పల్లి కొండేశ్వర స్వామి ఆలయంలో నేటి నుండి 20వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయని తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రెండు రోజులు తిరుపతికి చెందిన ఉభయ దారు పప్పు గిరి మునికష్ణ, తలారి పుష్పలచే పుష్పాలంకరణ, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు మాదర పాకం కు చెందిన దాత పి.ఎస్. గుణశేఖర్ కిరాణా సరుకులు ఇవ్వనున్నారు. మహాశివరాత్రి రోజు ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రసాదం ఉభయదాతగా చెన్నై టీ.నగర్ కు చెందిన కే. సుందర రాజన్, ఎస్.ఎస్ ఫౌండేషన్ వారి కుటుంబ సభ్యులు వ్యవహరించనున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవం 11 రోజులకు శివాచార్యులకు మూడు పూటల భోజన సదుపాయం సత్యవేడు పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.శివకుమార్ రెడ్డి ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో సురుటపల్లి ధర్మకర్తల మండలి సభ్యులు సురేష్, ఆనంద్, ముని వేలు, చిత్ర, సత్య,ఆలయ ప్రత్యేక ఆహ్వానితులు బాలిరెడ్డి రాధాకష్ణారెడ్డి పాల్గొన్నారు.

యోగిమల్లవరంలో మహాకుంభాభిషేక ఘట్టం






తిరుచానూరు యోగి మల్లవరంలో వెలసిన శ్రీ శ్రీ కామాక్షీ అంబా సమేత పరాశరేశ్వర స్వామి దేవస్థానంలో మహా కుంభాభిషేకం ఘట్టం అత్యంత వైభవంగా జరిగింది. సుమారు వెయ్యి సంవత్సరాల చరిత్ర గల శ్రీ కామాక్షీ అంబా సమేత పరాశరేశ్వర ఆలయంలో పది రోజులు పాటు కుంభాభిషేక వేడుకలు దేవస్థానం నిర్వహించింది. చివరి రోజున ఆరవ కాల పూజ ,ఉదయం ఐదు గంటలకు అంకురార్పణ ఉదయం 8 గంటలకు మహా పూర్ణాతి యాత్ర సంకల్పం, ఉదయం 8:30 యాగశాల నుండి కలశంలో బయలుదేరి 9గంటలకు స్వామి అమ్మవారు విమాన గోపురము రాజ గోపుర మహా కుంభాభిషేకం , అనంతరం 9:30 గంటలకు శ్రీ కామాక్షీ అంబా సమేత పరాశరేశ్వర స్వామి మహా కుంబాభిషేక ఘట్టం కన్నుల పండగ జరిగింది. మధ్యాహ్నం మహా అభిషేకము ధ్వజారోహణం, తరువాత అన్నదాన చేశారు. ఈ మహా కుంభాభిషేకానికి తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి దంపతులు పది రోజులుపాటు ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. శివాలయ ఆలయ నిర్మాణానికి పనిచేసిన కార్మికులకు వస్త్రాలు, స్వీట్లు పంపిణీ చేసి పూలమాలతో సత్కరించారు. తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామచంద్రారెడ్డి, ప్రధాన అర్చకులు మూర్తి గురుకుల్, ప్రసాద్ గురుకుల్ ,వినోద్ గురుకుల్ , దేవస్థాన సిబ్బంది గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'క్రషింగ్' బకాయిలు రూ.33 కోట్లు

సగానికి పడిపోయిన సాగు విస్తీర్ణం
రూ.700 తగ్గించి ఇస్తున్న దళారులు
సు'దూరం'లో చెరకు 'క్రషింగ్'




ప్రజాశక్తి - పిచ్చాటూరు

నేతం సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఇప్పటికే 33 కోట్ల రూపాయలను రైతులకు చెల్లించాల్సి ఉంది..ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్ల బకాయిలు బోలెడు ఉన్నా, ఆ ఫ్యాక్టరీకే ఈ ఏడాదీ చెరకును తోలాల్సిన గత్యంతరం లేని పరిస్థితి. ప్రత్యామ్నాయం లేకపోవడం వల్ల ఏటా సాగు విస్తీర్ణం తగ్గించేస్తున్నామని, గతంలో 18వేల ఎకరాల్లో సాగయ్యేదని, ఈ ఏడాది 9వేల ఎకరాకు పడిపోయిందని రైతులు లబోదిబోమంటున్నారు. ఉన్నతాధికారులు, నేతం యాజమాన్యం మధ్య దళారులు మాత్రం కాసులు దండుకుంటున్నారు. టన్నుకు రూ.700 తగ్గించి రైతులకు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నింద్ర, గాజులమండ్యం, పుంగనూరు, చిత్తూరు, బిఎన్‌కండ్రిగ, ఎస్ఆర్‌పురం మండలాల్లో చక్కెర కర్మాగారాలు ఉన్నాయి. పాలకుల నిర్లక్ష్యంతో ప్రస్తుతం ఎస్ఆర్‌పురం మండలం నెలవాయి వద్ద ఉన్న ఒక్క చెరకు ఫ్యాక్టరీ మాత్రమే నేటికీ క్రషింగ్ చేస్తూ ఉంది. అయితే పరిమితికి మించి ఫ్యాక్టరీ వారు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ఫ్యాక్టరీతో అగ్రిమెంట్ ద్వారా నమోదు చేసుకున్న వారు రైతులకు మాత్రమే కటింగ్ ఆర్డర్ ఇస్తున్నారు. అగ్రిమెంట్ లేనివారి పరిస్థితి దళారులను ఆశ్రయిస్తున్నారు. చెరకు టన్నుకు రూ.2765 రూపాయలు ఇస్తుంటే, దళారులు మాత్రం రైతును నిలువెత్తున మోసం చేస్తూ రెండువేల రూపాయలు చేతిలో పెడుతున్నారు. ఒక టన్నుకు రూ.700 రూపాయలు రైతులు మోసపోతున్నారు.

నింద్ర మండలంలో 1997, డిసెంబర్ 14న ప్రైవేట్ సుగర్ ఫ్యాక్టరీని వినోద్‌బేడి చేతుల మీదుగా ప్రారంభించారు. నింద్ర, పిచ్చాటూరు, నాగలాపురం, కెవిబిపురం, నారాయణవనం, విజయపురం మండలాల రైతులకు ఈ ఫ్యాక్టరీ గొప్ప వరంగా ఉండేది. అనేక రకాల పంటలు వదులుకుని 18వేల ఎకరాల్లో చెరకు పంటను ఆరు మండలాల్లో పండించడం ప్రారంభించారు. అయితే ప్రస్తుతం సగానికి పైనే రైతులు ఆనాసక్తి చూపుతున్నారు. చెరకు పంట వద్దు అనుకునే స్థాయికి వచ్చారంటే రైతన్న కష్టాలను అర్థం చేసుకోవచ్చు. నింద్ర నేతమ్స్, బుచ్చినాయుడు కండ్రిగ సుగర్ ఫ్యాక్టరీకి 2019, 2020 సంవత్సరాల్లో తోలిన చెరకు బకాయిలు నేటికీ రైతన్నలకు చెల్లించలేదు. రైతుసంఘాలతో కలిసి దీర్ఘకాలిక పోరాటాలు చేసినా ఉన్నతాధికారుల నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తూ, బకాయిలు మాత్రం నేటికీ రైతుల అకౌంట్లకు జమ కాలేదు. ఇప్పటికైనా బకాయిలు చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

బకాయిలు చెల్లించండి : ఆదినారాయణరెడ్డి, విజయపురం



నాకు ఆరు ఎకరాల పొలం ఉంది. చెరకు పంట పండిస్తాను. 2019-20లో 250 టన్నుల చెరకును నింద్ర నేతమ్స్ సుగర్ ఫ్యాక్టరీకి తోలాను. మూడు లక్షల రూపాయలు రావాల్సి ఉంది. బకాయిల కోసం రాజకీయ పార్టీల నాయకులతో, రైతుసంఘాలతో కలిసి ధర్నా చేశాం. ఫలితం శూన్యం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మా బకాయిలు అందేలా చూడాలి.

నేతమ్స్ ఫ్యాక్టరీ తెరిపించాలి : సుదర్శన్‌నాయుడు, నింద్ర



నేను నింద్ర మండల వాస్తవ్యున్ని. ఒక ఎకరా చెరకు పండించాలంటే 40వేల నుంచి 50వేలు ఖర్చు అవుతుంది. అయినా అప్పోసప్పో చేసి చెరకు పండించి నేతం సుగర్ ఫ్యాక్టరీకి తోలాను. ఐదు లక్షల రూపాయలు బకాయిలు రావాల్సి ఉంది. ఈ ఏడాది చెరకు పంటను పక్క రాష్ట్రమైన తమిళనాడుకు తక్కువ ధరతో దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి. ప్రభుత్వం స్పందించి మూతబడిన నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీని ప్రారంభించాలి.

రైతులను ఆదుకోవాలి : జ్యోతిరాజు, పిచ్చాటూరు



నేను పండించిన చెరకును నింద్ర మండలంలో ఉన్న నేతమ్స్ ఫ్యాక్టరీకి రెండేళ్ల క్రితం విక్రయించాను. మూడేళ్లు పూర్తవుతున్నా బకాయిలు చెల్లించలేదు. చక్కెర ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులతో పాటు కార్మికులను మోసం చేసి ఫ్యాక్టరీని మూసేసింది. ఇపుడు క్రషింగ్ చేసుకోవాలంటే సాగర్ ఫ్యాక్టరీలో రైతు అగ్రిమెంట్‌చేసుకుంటేనే కటింగ్ ఆర్డర్ ఇస్తారు. దీంతో దళారులను ఆశ్రయిస్తున్నాం.

సాగు విస్తీర్ణం తగ్గింది : సంజీవరెడ్డి, వ్యవసాయ అధికారి



పిచ్చాటూరు మండలంలో 2019, 2020 సంవత్సరాలకు ముందు 2,500 ఎకరాల్లో చెరకు పంట సాగయ్యేది. రైతులు ఎంతో మక్కువతో చెరకును సాగు చేసేవారు. ప్రస్తుతం ఫ్యాక్టరీ మూసివేయడం, చెరకు బకాయిలు రాకపోవడంతో ఈ ఏడాది 1165 ఎకరాల్లోనే చెరకు పండించారు. సగానికి పైనే సాగు విస్తీర్ణం పడిపోయింది.

జాతీయ స్థాయిలో 'శ్రీ చైతన్య' సత్తా



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: స్థానిక స్వామివీధిలోని శ్రీ చైతన్య పాఠశాల నుంచి ఇటీవల జరిగిన జాతీయస్థాయి క్యాట్ పరీక్షల్లో 72 మంది విద్యార్థులకు గాను 63 మంది ఉత్తీర్ణత సాధించి సతా చూపారని ఆ పాఠశాల ఏజీఎం శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయనతోపాటు కో-ఆర్డినేటర్ బాలాజీ, ప్రిన్సిపల్ రవికిరణ్ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రవికిరణ్ మాట్లాడుతూ ప్రశంసాపత్రాలోపాటు నగదు బహుమతి సాధించడం గొప్ప విషయమన్నారు. అనంతరం విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శరవణ, డీన్ తిరునావగరసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఎస్పీ చైతన్యయాత్రకు తరలిరండి



ప్రజాశక్తి-గూడూరు: బహుజన రాజ్యాధికార చైతన్య యాత్రను జయప్రదం చేయాలని తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి షోడవరం సుధాకర్, గూడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మీజూరు సుబ్రహ్మణ్యం తెలిపారు. తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలో ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నోట్ల రాజ్యాన్ని కూలుద్దాం – ఓట్ల రాజ్యాన్ని సాధిద్దాం అనే నినాదంతో బహుజన సమాజ్ పార్టీ జనవరి 26వ తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ప్రారంభమైన బహుజన రాజ్యాధికారి చైతన్య యాత్ర నెల్లూరు జిల్లాలో పూర్తి చేసుకొని తిరుపతి జిల్లాకి విచ్చేస్తున్న సందర్భంగా శనివారం సాయంత్రం నాలుగు గంటలకు బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బి.ఎస్.పి నియోజకవర్గ అధ్యక్షులు అన్నెం మల్లికార్జున్, సీనియర్ నాయకులు నాసిన భాస్కర్ గౌడ్, బందిలి అంకయ్య పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : పుత్తూరు శ్రీకామాక్షి సమేత శ్రీ సదాశివ స్వామి దేవస్థానంలో జరిగే శివరాత్రి మహోత్సవాలకు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి రోజాకు శుక్రవారం ఆహ్వాన పత్రికను అందించారు. అనంతరం గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సదాశివకోన ఆలయ పాలకమండలి ఛైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

చురుగ్గా మురుగునీటి కాలువల నిర్మాణం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రామకృష్ణాపురం పంచాయతీలోని గొల్లపల్లిలో రూ.12.5 లక్షలతో మంజూరైన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు సర్పంచ్ విరిత దేవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో చురుగ్గా జరుగుతున్నాయి. శుక్రవారం మురుగునీటి కాలువ పనులు ప్రారంభించారు. ఏఈ తరుణ్ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీరింగ్ అనుదీప్, పంచాయతీ కార్యదర్శి నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

వెట్టి చాకిరి నిర్మూలించాలి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్పిన్నింగ్ మిల్ వద్ద వెట్టి చాకిరి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా మండల న్యాయ సేవా అధికారి సంస్థ పుత్తూరు, పుత్తూరు కార్మిక శాఖ సంయుక్తంగా అవగాహన సదస్సు ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పుత్తూరు న్యాయవాది సంజీవి, మురుగేష్ రెడ్డి, పుత్తూరు కార్మిక శాఖ అధికారి హేమాచారి వెట్టి చాకిరిని నిర్మూలించాలని.. వెట్టి చాకిరి చేయిస్తే చట్టారీత్యా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు.

శ్రీకోటమ్మ దేవస్థానంలో అన్నదానం



ప్రజాశక్తి-కోట: కోట పట్టణంలో వెలసియున్న శ్రీకోటమ్మ తల్లి దేవస్థానంలో దాతల దాతత్వంలో అన్న ప్రసాద వినియోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోట గ్రామానికి చెందిన శ్రీ షిరిడి సాయి అక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం కోట గ్రామంలో విద్యుత్ శాఖలో లైన్ మెన్ గా పనిచేస్తున్న కొండూరు అంకయ్య, లక్ష్మి, అభిలాష్ ,అనుపమ, నవీన్ కుమార్, ఈవాన్ష్ రాజ్ ఉభయదాతలుగా వ్యవహరించారు. అనంతరం ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి, లక్ష్మికవిత దంపతుల సమక్షంలో ఉభాయదాతలను ఆలయ సంప్రదాయం ప్రకారం సత్కరించారు.

బాలాయపల్లి తహసీల్దారుగా శ్రీనివాసులు

ప్రజాశక్తి-బాలాయపల్లి: బాలాయపల్లి తహసీల్దారుగా శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై బాలాయపల్లి తహశీల్దారుగా బాధ్యతలు చేపట్టారు.

విశ్వసనీయతకే అధిక ప్రాధాన్యత



గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు



ప్రజాశక్తి-కోట: తమ వ్యక్తిగత జీవిత విధానంలో విశ్వసనీయతకే అధిక ప్రాధాన్యత ఇస్తానని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం కోట మండలంలోని ఏఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో 'మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతనానికి విశ్వసనీయతగా పనిచేస్తూ ముందుకు వెళతానని తెలిపారు. గ్రామ వాలంటీర్ల సేవలు అంతులేనివని, గ్రామాల్లో ఉండే కుటుంబాలతో కలిసి మెలిసి ఉంటున్నందుకు వారికి అభినందనలు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు రానున్న 2024 ఎన్నికల్లో విజయం పొందడానికి ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మరెన్నో సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కోవిడ్ సమయంలో ప్రజలకు మరెన్నో సహాయ సహకారాలు అందించడం ప్రజలే గమనిస్తున్నారని గుర్తు చేశారు. గ్రామ వాలంటీర్లు, గహసారథులు సమిష్టిగా ప్రయాణం చేయాలని.. ఏదైనా సమస్య ఉంటే తమ దష్టికి తీసుకురావాలన్నారు. చంద్రబాబు నాయుడి ప్రభుత్వం ఉన్నప్పుడు తను వైసీపీ ఎంపీగా ఉన్నానని.. 20 సార్లు అసెంబ్లీ మీటింగ్ సమావేశానికి హాజరయ్యానే తప్ప.. అసెంబ్లీలో మాట్లాడటానికి ఒక్క అవకాశం ఇవ్వలేదని వాపోయారు. అనంతరం బ్యాడ్జీలు, స్టికర్లు, కరపత్రాలను అందించారు. కోట ఎంపీటీసీ షేక్ మొబిన్ బాషా, మాజీ జడ్పీటీసీ ప్రసాద్ గౌడ్, వైసీపీ సీనియర్ నాయకులు శ్రీరామ్, గురుస్వామి, మధుసూదన్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ సంపత్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వగత్తూరులో గడప గడపకూ ఆదిమూలం

ప్రజాశక్తి -కేవీపీపురం: వగత్తూరు గ్రామంలో శుక్రవారం గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. పథకాలు అందాయా.. లేదా అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారుంటే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వగత్తూరు గిరిజనులకు రూ.50 వేలు విలువైన మైక్‌సెట్‌ను అందించారు. వగత్తూరు సర్పంచ్ కాటమ్మ గోపాల్, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ గవర్ల కష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మీ, నందకుమార్, జడ్పీటీసీ మునెమ్మ , సర్పంచుల సంఘ అధ్యక్షుడు రాము, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: లక్ష్మీపురం గిరిజన కాలనీలో ప్రజా ప్రగతి ట్రస్టు కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శుక్రవారం బాల్యవివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు జరిపించాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే రూ.లక్ష జరిమానాతోపాటు రెండేళ్ల జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. అనంతరం మహిళా పోలీస్ కాంచన మాట్లాడుతూ అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు ఉండి ఇద్దరూ పదో తరగతి పాస్ అయి ఉంటే ప్రభుత్వం పెళ్లికానుక రూ.లక్ష అందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రగతి ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: రానున్న మహా శివరాత్రి సందర్భంగా ఆలయాలలో బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సునీల్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే వివాహాలు జరగడంతో ఆడ పిల్లలు అనారోగ్యం పాలవుతారని.. బాలికలకు హోదా, శక్తి , పరిణితి లేకపోవడంతో గృహ హింసకు, లైంగిక వేధింపులకు, సామాజికంగా విడిగా ఉండటం వంటి పరిస్థితులకు గురవుతున్నారని పేర్కొన్నారు.

మీటర్ల మంజూరులో ఈఈ మాటలు అవాస్తవం



ప్రజాశక్తి-గూడూరు : గూడూరు పట్టణం అరుంధతివాడలో మీటర్ల మంజూరులో ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ ఇస్మాయిల్ మాటలు అవాస్తవమని ఆశాఖ అవినీతి ఏఈ, ఏడీలను కాపాడేందుకే మాట్లాడుతున్నారని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ యునైటెడ్ ఫోరం జాతీయ అధ్యక్షులు రవి రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం గూడూరు మండల పరిధిలోని గోగినేనిపురం డీఈ కార్యాలయం ఎదుట ఫోరం ఆధ్వర్యంలో నిరసన దీక్ష రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఫోరం జాతీయ అధ్యక్షులు మాట్లాడుతూ అరుంధతి వాడలో ఓ ఇంటికి రూ.70 వేలు విద్యుత్తు బకాయిలు ఉన్నట్లు ఆ ఇంటి కనెక్షన్ నిలిపేశారు. దీంతో ఆ ఇంటి యజమాని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడుకుని బకాయిలో రూ.7 వేలు చెల్లించి మిగిలిన బకాయిని రెండు మూడు విడతలుగా చెల్లిస్తానని లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు. దీంతో సంతృప్తి చెందిన విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి విద్యుత్ మీటర్‌ను అమర్చారు. అయితే ఉద్దాల మణి, ఉద్దాల అయ్యప్పలు వేర్వేరుగా వారి ఇళ్లకు మీటర్లకు డిపాజిట్ చెల్లించారు. ఆ మీటర్లు అమర్చే ముందు వినియోగదారులకు స్తంభాల నుంచి కనెక్షన్ తీసుకోమని ఆదేశాలు జారీ చేశారు. ఏఈ మల్లికార్జునరావు, ఏడీఈ ప్రసాదరావు లంచాలు డిమాండ్ చేస్తూ మీటర్లను వెనక్కి తీసుకెళ్లారని ఆరోపించారు. శుక్రవారం ఇస్మాయిల్ విలేకరుల సమావేశంలో ఏఈ, ఏడీఈలు ఎలాంటి అవినీతి కి పాల్పడలేదని చెప్పడం విడ్డూరంగా ఉందని ఆయన తెలిపారు.

మంచినీళ్ల గుంటను సుందరీకరంగా తీర్చిదిద్దుదాం..!



ప్రజాశక్తి-రేణిగుంట: చారిత్రాత్మకమైన మంచినీళ్ల గుంటను సుందరీకరంగా తీర్చిదిద్దుతామని వైసీపీ రేణిగుంట ఇన్‌ఛార్జి బియ్యపు పవిత్రరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆమె తుడా సెక్రెటరీ లక్ష్మీతో కలిసి మంచినీళ్ల గుంట ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బియ్యపు పవిత్రరెడ్డి మాట్లాడుతూ చారిత్రాత్మకమైన మంచినీళ్ల గుంట ప్రాంతం వ్యర్థాలతో అస్తవ్యస్తంగా ఉందని.. ఆ ప్రాంతం అభివద్ధి చేయాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి దృష్టికి స్థానికులు తీసుకెళ్లారన్నారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మంచినీళ్ల గుంట ప్రాంతాన్ని పరిశీలించి అభివద్ధి పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో మంచినీళ్ల గుంట ప్రాంతాన్ని పరిశీలించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ మండలాధ్యక్షుడు, ఎంపీపీ కలపాటి హరిప్రసాద్ రెడ్డి, సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, వైస్ ఎంపీపీ సుజాత, మండల కో-ఆప్షన్ సభ్యులు సుభాన్ రాజా, ముస్లిం మైనార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, వార్డ్ మెంబర్లు రసూల్, ఇన్నసాధన్, ఈశ్వరి, గురవరాజు పల్లి రహీం, రామ్మోహన్, మల్లి రెడ్డి, మర్రిమంద మస్తాన్, ఈశ్వర్, అధికారులు ఎంపీడీవో హరిబాబు, పంచాయతీ సెక్రెటరీ విజయభాస్కర్, సచివాలయం సిబ్బంది వార్డు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ఆకాష్‌బైజూస్ విద్యార్థి ప్రతిభ



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతిలోని ఆకాష్ బైజూస్ విద్యార్థి గణేష్ సాయి ఇటీవల జరిగిన జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జెఈఈ) మెయిన్ 2023 తొలి సీజన్‌లో 99.75 పర్సంటైల్ సాధించాడని ఆ సంస్థ రీజినల్ డైరెక్టర్ ధీరజ్ మిశ్రా తెలిపారు. ప్రపంచంలో అత్యంత కఠినమైన ప్రవేశ పరీక్షగా భావిస్తోన్న ఐఐటీ జెఈఈలో విజయం సాధించేందుకు గణేష్ ఆకాష్ బైజూస్ ఇనిస్టిట్యూట్‌లో క్లాస్‌రూమ్ ప్రోగ్రామ్‌లో చేరాడు. కాన్సెప్ట్‌లను అర్థం చేసుకోవడంలో తాము పడిన కష్టం, లెర్నింగ్ షెడ్యూల్స్‌కు కట్టుబడి ఉండటమే టాప్ పర్సంటైల్ సాధించిన ఎలైట్ జాబితాలో చోటు సంపాదించుకోవడానికి కారణంగా గణేష్ అభివర్ణించాడు. "ఆకాష్ ఇనిస్టిట్యూట్‌కు నేను ధన్యవాదములు చెబుతున్నాము. వారు నాకు అన్ని విధాలుగా సహాయపడ్డారు. కంటెంట్, కోచింగ్ పరంగా వారి తోడ్పాటు లేకుండా అతి తక్కువ సమయంలో విభిన్న బోధనాంశాలలో నేను ఎన్నో కాన్సెప్ట్‌లను ఒడిసిపట్టలేను"అని అన్నాడు. గణేష్‌ను అభినందించిన ఆకాష్ బైజూస్ రీజనల్ డైరెక్టర్ ధీరజ్ మిశ్రా మాట్లాడుతూ జెఈఈ మెయిన్ 2023 కోసం దేశవ్యాప్తంగా 8.6 లక్షల మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. పర్సంటైల్ టాపర్‌గా అతను సాధించిన విజయం , అతను పడిన కష్టం, అంకితభావం, అతని తల్లిదండ్రులు అందించిన మద్దతు గురించి ఎంతో వెల్లడిస్తుంది. భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షిస్తున్నాము" అని అన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి : డిఐజి

తిరుపతి సిటీ : ఈనెల 11 వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ నేపథ్యంలో అందరూ సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని డిఐజి రవిప్రకాష్ సూచించారు. రాజీ మార్గం ప్రాధాన్యతను ఇరు వర్గాల వారికి తెలియజేసి ఎక్కువ కేసులను పరిష్కారం అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా పోలీసు అధికారులతో శుక్రవారం ఆయన టెలికాన్ఫరెన్స్ లో సమీక్షించారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు ఆయా పోలీసు కార్యాలయాలు/పోలీసు స్టేషన్ల నుండీ పాల్గొన్నారు.

అదనపు జిల్లా కోర్టు గెజిట్ నోటిఫికేషన్ పై హర్షం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి అడిషనల్ జిల్లా కోర్టుకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడంపై శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. స్థానిక కోర్టు ఆవరణలో శుక్రవారం బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేసి మాట్లాడారు. శ్రీకాళహస్తిలో జిల్లా అదనపు కోర్టు ఏర్పడిన అనతి కాలంలోనే గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడం శుభపరిణామన్నారు. త్వరలోనే శ్రీకాళహస్తి చుట్టుపక్కల మండలాల ప్రజలకు అడిషనల్ జిల్లా కోర్ట్ సేవలందుతాయని చెప్పారు. గెజిట్ నోటిఫికేషన్ కు కషి చేసిన న్యాయమూర్తులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

నేడు విద్యుత్తుండని ప్రాంతాలు

ప్రజాశక్తి-నాయుడుపేట: సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా నాయుడుపేట పరిసర ప్రాంతాలలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని.. వినియోగదారులు సహకరించాలని డీఈఈ శేఖర్ కోరారు. పెళ్లకూరు మండలం,పెన్నెపల్లిలోని విద్యుత్తు ఉపకేంద్రం మరమ్మతుల కారణంగా నాయుడుపేట పట్నం, మేనకురు, జువ్వాలపాలెం, విన్నమాల, నాయుడుపేట గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలని కోరుతున్నామని తెలిపారు.

రేణిగుంట: రేణిగుంట మండలంలోని తూకివాకం, గురురాజుపల్లి, కరకంబాడి, ఎలమండ్యం పంచాయతీలో, రేణిగుంట పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జాబ్ మేళాలో 49 మంది ఎంపిక



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 72 మంది విద్యార్థులు హాజరు కాగా.. 49 మంది ఎంపికైనట్లు కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వీరయ్య తెలిపారు. రేణిగుంట సమీపంలోని టెల్ కంపెనీ, ఎన్‌టీసీపీ కంపెనీ వారు పుత్తూరు డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి సాయిమోహన్, కళాశాల జేపీసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉషారాణి జేపీసీ కుమార్, శ్రీదేవి, కృష్ణ పాల్గొన్నారు.

సాంస్కృతిక కళా రంగాన్ని కాపాడాలి

తిరుపతి సిటీ : రాష్ట్రంలో సాంస్కృతిక కళా రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కవులు, రచయితలు, కళాకారులపై ఉందని ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య తెలిపారు . శుక్రవారం స్థానిక బైరాగి పట్టెడ లోని సిపిఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి తిరుపతి జిల్లా ముఖ్యుల సమావేశం చింతా రవి అధ్యక్షతన శుక్రవారం జరిగింది . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ కళకోసం కాదు కళ ప్రజల కోసమని పనిచేస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు నేటి రాజకీయాల కనుగుణంగా కళా రూపాలు తయారు చేసుకోవాలని అన్నారు. గ్రామీణ జానపద కళారూపాలు కొండపైన ప్రదర్శనలు ఇవ్వడానికి టి టి డి వారు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశం లో రాష్ట్ర ఆఫీసు బేరర్స్ సంగీతం గురప్ప , మారెళ్ల శ్రీనివాసులు , తిరుపతి జిల్లా కార్యదర్శి జె . నాగరాజు పాల్గొన్నారు .

ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం



శ్రీకాళహస్తి : పట్టణంలోని నల్ల గంగమ్మ గుడి ఆవరణలో శుక్రవారం రాస్, టాటా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో క్యాన్సర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆ ఆలయ కమిటీ చైర్మన్ కంఠ రమేష్, యూనియన్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ హరికష్ణ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు160 మంది శిబిరంలో పాల్గొని వైద్య సేవలు పొందారు. ఆలయ కమిటీ సభ్యులు పూల కష్ణ మూర్తి, టాటా ట్రస్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ హేమంత్, రెడ్డి కుమారి, డాక్టర్ భార్గవ్, చైతన్య, మెహతాజ్ పాల్గొన్నారు.

స్కిమ్స్‌లో ఇన్వెస్టర్ అవేర్నెస్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక స్కిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇన్వెస్టర్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రముఖ స్టాక్ మార్కెట్ ఎనాలసిస్ట్, శిక్షకుడు ప్రొఫెసర్ నాగార్జున ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు మార్కెట్ ప్రపంచంలో పెట్టుబడులో పెట్టడం ఎలా? సెక్యూరిటీ పొందడం లాంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ మిద్దెల హరి, ప్రిన్సిపాల్ గీతా దేవి తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆడపిల్లల్లో ఆత్మవిశ్వాసం

క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం ఎన్ఎస్ఎస్ యూనిట్ సెవెన్ యుక్త ఆధ్వర్యంలో శుక్రవారం విశ్వవిద్యాలయంలోని ఫిజిక్స్ డిపార్ట్మెంట్ విద్యార్థులకు స్వీయ రక్షణ పై కరాటే నిపుణులు శిక్షణ ఇచ్చారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ సెవెన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి మాధవి తెలిపారు. మహిళా అధ్యయన కేంద్రం డాక్టర్ కె. రాణి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకర్ పాల్గొన్నారు.

పిల్లలకు పరిసరాలపై అవగాహన తప్పనిసరి



ప్రజాశక్తి-గూడూరు: గూడూరు రెండో పట్టణంలోని శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యం పిల్లలకు పాఠ్యపుస్తకాలలోని పాఠాలను బోధించడంతోపాటు వారికి పరిసరాలపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం కూరగాయల మార్కెట్ ను సందర్శించారు. కూరగాయల ఆకృతులు, రంగులు, తినడంతో కలిగే ప్రయోజనాలను ఉపాధ్యాయులు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నవకోటి నాయుడు, అకడమిక్ కోఆర్డినేటర్ హరికృష్ణ, సునీల్, ప్రైమరీ ఇన్‌ఛార్జి సింధు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళులు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : పట్టణంలోని ఆరేటమ్మ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త ఆరేటయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భాను ప్రకాష్ చేరుకొని భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నౌక నిర్మాణ రంగాన్ని ప్రోత్సహిస్తారా?

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మేక్ ఇన్ ఇండియాతో నౌక నిర్మాణ రంగాన్ని ప్రోత్సహిస్తున్నారా.. దేశీయంగా ఉన్న ఓడ మరమ్మతు పరిశ్రమకు సంబంధించి వాటి ఆర్థిక విజయాలు విడిభాగాల తయారీలో స్వదేశీ తయారీదారులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మద్దతు అందిస్తున్నారని తిరుపతి పార్లమెంటు సభ్యులు మద్దెల గురుమూర్తి పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం పార్లమెంటు సమావేశాల్లో భాగంగా తిరుపతి ఎంపీ గురుమూర్తి అడిగిన ప్రశ్నలకు కేంద్ర నౌకాయానశాఖ మాత్యులు శర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ మంత్రిత్వ శాఖ వద్ద అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ప్రైవేట్ షిప్‌యార్డ్‌లలో 725 నౌకలు మరమ్మతులు చేయబడ్డాయని.. కోవిడ్-19 ప్రభావంతో పరిమిత పని ఏర్పాట్లు, సరఫరా అంతరాయాలు, అంతర్జాతీయ, అంతర్‌రాష్ట్ర లాక్ డౌన్ పరిమితులు మొదలైన అనేక కారణాలతో ఓడ మరమ్మతు కార్యకలాపాల స్థాయిని తగ్గించిందని తెలిపారు.

నేడు బీఎన్‌కండ్రిగలో ఎన్నికలపై సమావేశం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం ఉదయం ఎమ్మెల్సీ ఎన్నికలపై అన్ని పార్టీల వారితో సమావేశం నిర్వహించనున్నట్లు తహశీల్దారు సుబ్రమణ్యం, ఎంపీడీవో త్రివిక్రమరావు తెలిపారు. కార్యక్రమానికి అన్ని పార్టీల నాయకులు హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : గత ఏడాది కాలంగా ప్రతినెలా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీతాలు సక్రమంగా అందించడం లేదని, నెల ప్రారంభమై నేటికీ ఇప్పటికే జీతాలు అందక ఉపాధ్యాయులు నానా అవస్థలు పడుతున్నారని ఎఫ్ఏపీటీవో ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద ఉపాధ్యాయులు ర్యాలీ చేస్తూ ధర్నా నిర్వహించారు. యూటీఎఫ్ నాయకులు దాసరి మునెయ్య, ఎస్టీయూ పవన్‌కుమార్‌రెడ్డి, ఏపీటీఎఫ్ నరేంద్ర మాట్లాడుతూ ప్రతినెలా మెడికల్ ఖర్చులు, నిత్యావసర ఖర్చులు, కుటుంబ అవసరాలతో పాటు బ్యాంకుల్లో లోన్లు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల సంఘ నాయకులు వేణుగోపాల్, మునిరత్నం, భాస్కర్, కన్నప్ప, హరినాథ్, మునస్వామి, మురళీకృష్ణ, జ్యోతి ప్రసాద్, గీత, కేశవ, శాంతి, సరిత తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-బాలాయపల్లి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దారు శ్రీనివాసులు, డి.టి అజ్మీత్తుల్లఖాన్, ఆర్ఐ పూర్ణ తో కలసి శుక్రవారం పరిశీలించారు. అర్హులైన యువతీ, యువకులకు ఓట్లు నమోదు సమయంలో అన్ని వసతులు కల్పించాలన్నారు. మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అన్నివసతులు ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆయన వెంట సర్వేయర్ శరత్, ఉపాధ్యాయులు శ్రీకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాపై ఉక్కుపాదం

ప్రజాశక్తి-పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని కలవకూరు గ్రామం వద్ద స్వర్ణముఖి నదికి అడ్డంగా నిర్మించిన కల్వర్టు నుంచి శుక్రవారం తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ వంకేశ్వరం శశి కుమార్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. పుల్లూరు గ్రామానికి చెందిన బండి ముని ప్రకాష్ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని పెళ్లకూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్సై కృష్ణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.